# నవతరం

తెలుగు దినపత్రిక

NAVATARAM TELUGU DAILY

ఎడిటర్: శిరిగిరి వరదరాజు

ప్రచురణ కేంద్రం: హైదరాబాద్ | సంపుటి : 11 | సంచిక : 243 | AP/TEL/2018/76747 | ఆదివారం 21-12-2025 | పేజీలు : 04 | వెల : 01 రూ..


## మహారాష్ట్ర స్థానిక పోరులో మహాయుతి హవా అతిపెద్ద పార్టీగా అవతరించిన బీజేపీ



# రాష్ట్రపతి నిలయంలో ఎట్‌హోం



### హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్, సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 21 : శీతాకాల విడిదిలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 'ఎట్ హోం'సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో తేనీటి విందుపలువురు రాజకీయ, పౌర ప్రముఖులకు రాష్ట్రపతి ఆతిథ్యంరాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన శీతాకాల విడిదిలో భాగంగా సికింద్రాబాద్‌లోని బొల్లారం రాష్ట్రపతి నిలయంలో 'ఎట్ హోం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ తేనీటి విందుకు తెలంగాణ గవర్నర్ విష్ణుదేవ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా


(మిగతా 2వ పేజీలో)

# అస్సాంలో కాంగ్రెస్‌పై ఆరోపణలు రాజకీయ ప్రయోజనాల కోసమే

### వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు విపక్షాలపై నిందలు: ఖర్గే

### బీజేపీ పాలనలో భద్రత కుంటుపడితే బాధ్యత ఎవరిది?

### ఉపాధి హామీ చట్టాన్ని ధ్వంసం చేస్తే ఊరుకోం



కలబురగి (కర్ణాటక), డిసెంబరు 22: అస్సాంలో కాంగ్రెస్‌పై దేశ వ్యతిరేక కార్యకలాపాల ఆరోపణలు చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల నేపథ్యంలో రాజకీయ లబ్ధి కోసం చరిత్రను వక్రీకరిస్తూ మోదీ వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. అస్సాంను తూర్పు పాకిస్థాన్‌లో కలపాలన్న కుట్రలో

(మిగతా 2వ పేజీలో)



# దేశ వ్యతిరేకి కాంగ్రెస్!

### అక్రమ చొరబాటుదారులకు అండదండలు ఇస్తోంది

### అధికారమే ఆ పార్టీ ఏకైక లక్ష్యం: ప్రధాని మోదీ ధ్వజం

### ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకత వెనుక ఓటు బ్యాంకు రాజకీయం

### నామ్‌రూప్‌లో రూ.10,601 కోట్ల ఎరువుల కర్మాగారం ప్రారంభం

నామ్‌రూప్, డిసెంబరు 22: ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌పై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశ వ్యతిరేక కార్యకలాపాల్లో ఆ పార్టీ నిమగ్నమైందని, బంగ్లాదేశ్ నుంచి వచ్చిన అక్రమ చొరబాటుదారులు అసోంలో స్థిరపడేందుకు అన్ని విధాలా అండదండలు ఇస్తోందని ఆరోపించారు. అధికారమే కాంగ్రెస్ పార్టీకి ఏకైక లక్ష్యమని, దేశ భద్రత, ప్రజల ప్రయోజనాలు ఆ పార్టీకి ఏమాత్రం పట్టవని ధ్వజమెత్తారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న అసోంలో డిబ్రుగడ్ జిల్లా

(మిగతా 2వ పేజీలో)

# రోడ్డు మీద కాదు.. అసెంబ్లీలోనే నీళ్లపై తేల్చుకుందాం

### కృష్ణా-గోదావరి జలాలపై సభలో చర్చకు సిద్ధమని సీఎం రేవంత్ రెడ్డి సవాల్

### కృష్ణా జలాల్లో 36 శాతానికి సంతకం పెట్టింది కేసీఆరే: క్షమాపణ చెప్పాలి

### ఉమ్మడి రాష్ట్రం కంటే పదేళ్ల కేసీఆర్ పాలనలోనే తెలంగాణకు ఎక్కువ నష్టం

### అసెంబ్లీకి వస్తే గౌరవంగా చూసుకోవడం నా బాధ్యత

### ఏపీ ప్రాజెక్టులను పొగిడిన వీడియోలను సభలు జరిగే చోట ప్రదర్శిస్తాం



హైదరాబాద్, డిసెంబరు 21 : కృష్ణా, గోదావరి జలాల విషయంలో రోడ్లపై నినాదాలు అవసరం లేదని, అసెంబ్లీలోనే నిజాలు%-%నీరును తేల్చుకుందామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సవాల్ విసిరారు. ఉమ్మడి రాష్ట్రంతో పోలిస్తే కేసీఆర్ పదేళ్ల పాలనలోనే తెలంగాణకు నీటి విషయంలో తీవ్రమైన అన్యాయం జరిగిందని ఆయన ఆరోపించారు. కృష్ణా జలాల్లో ఏపీకి 64 శాతం, తెలంగాణకు 36 శాతం చాలని ఒప్పందంపై సంతకం పెట్టింది కేసీఆర్‌నేనని స్పష్టం చేశారు. ఆ సంతకంతో మహబూబ్‌నగర్, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాల భవిష్యత్తుకు తూట్లు పొడిచారని విమర్శించారు. ఈ పాపానికి తెలంగాణ ప్రజలకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కృష్ణా, గోదావరి జలాలపై సమగ్ర చర్చ కోసం జనవరి రెండో తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తామని సీఎం ప్రకటించారు. ఒక రోజు కృష్ణా జలాలపై, మరో రోజు గోదావరి జలాలపై చర్చిద్దామన్నారు. ఒక్కో అంశంపై రెండు రోజులైనా చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే ఆయన గౌరవానికి భంగం కలగకుండా చూసుకోవడం తన బాధ్యత అని హామీ ఇచ్చారు. సభకు వచ్చి చర్చిస్తేనే కేసీఆర్ క్రియాశీల రాజకీయాల్లో ఉన్నట్టని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, కల్వకుర్తి, పాలమూరు-రంగారెడ్డి, డిండి,

(మిగతా 2వ పేజీలో)



# అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది

### నదుల అనుసంధానం పేరిట గోదావరి జల దోపిడీకి కాంగ్రెస్ మౌనం

### పాలమూరు ఎత్తిపోతలకు జరుగుతున్న అన్యాయంపై రెండేళ్లుగా స్పందన లేదు

### చంద్రబాబు ఒత్తిడితోనే డీపీఆర్‌ను కేంద్రం వాపస్ పంపింది: కేసీఆర్

### కేంద్ర- రాష్ట్ర వైఖరిపై భారీ ప్రజా ఉద్యమానికి సిద్ధం

హైదరాబాద్: అబద్ధపు హామీలతో ప్రజలను మోసగించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. నదుల అనుసంధానం పేరిట గోదావరి జల దోపిడీ జరుగుతున్నా, పాలమూరు%-%రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అన్యాయం జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గం, శాసనసభా పక్షం, పార్లమెంటరీ పార్టీ నేతలతో సమావేశం అనంతరం కేసీఆర్ మీడియాతో మాట్లాడారు. "క్రమబద్ధంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణలో గ్యారంటీలు, బాండ్ పేపర్లు అంటూ ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. వంద శాతం సమ్మిళిత అభివృద్ధి మాదైతే, ఇప్పుడు ప్రజలకు శఠగోపం పెట్టే ప్రభుత్వం ఏర్పడింది. ఇది పూర్తిగా విఫలమైన పాలన" అని

(మిగతా 2వ పేజీలో)

# 420 హామీలను మూసీలో కలిపారా? లేక గాంధీభవన్‌లో పాతరేశారా?

### సోనియా గాంధీకి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ

### కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలుపై ఘాటు ప్రశ్నలు

### రెండేళ్ల పాలనలో హామీలకు ఏమైంది? అని నిలదీత

### ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని హెచ్చరిక



న్యూఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, మొత్తం 420 హామీల గతి ఏమైందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీని ప్రశ్నించారు. అవి గాలికి వదిలేశారా? మూసీ నదిలో కలిపేశారా? లేక గాంధీభవన్‌లో పాతరేశారా? అంటూ తీవ్ర వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ మేరకు ఆదివారం సోనియా గాంధీకి ఆయన ఒక బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ రైజింగ్%-%2047 విజన్ డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ఢిల్లీకి వచ్చి అందజేసిన సందర్భంగా, దానికి అనుగుణంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని సోనియా గాంధీ ఆకాంక్షించారని గుర్తుచేశారు. అయితే, 2023 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో సెప్టెంబర్ 17న తుక్కుగూడలో నిర్వహించిన బహిరంగ సభలో కాంగ్రెస్ మేనిఫెస్టోను విడుదల చేసి, అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ఆమె స్వయంగా ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నికల్లో విజయం సాధించి కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్నప్పటికీ, ఆ హామీల అమలుపై ఎప్పుడైనా సమీక్షించారా? కనీసం ముఖ్యమంత్రి మిమ్మల్ని కలిసినప్పుడు అయినా వాటి అమలు గురించి ప్రశ్నించారా? అని కిషన్‌రెడ్డి నిలదీశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మరిచి తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం వంచిస్తోందని

(మిగతా 2వ పేజీలో)



# మహాలక్ష్మి పథకంతో లాభాల్లోకి ఆర్టీసీ

### ఉచిత ప్రయాణాలతో ఆదాయం పెరిగింది: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

### 255 కోట్ల ఉచిత ప్రయాణాలు నమోదు

### ఆర్టీసీ బకాయిల్లో భారీ తగ్గుదల

### కొత్త బస్సులు, ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రోత్సాహం

హైదరాబాద్: మహాలక్ష్మి పథకం అమలుతో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) లాభాల బాట పట్టిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

(మిగతా 2వ పేజీలో)

# సీఎంకు, టీటీడీ ఛైర్మన్‌కు పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు

### కొండగట్టు అంజన్న ఆలయ అభివృద్ధికి 35.19 కోట్లు మంజూరు చేసిన టీటీడీ

### దీక్ష విరమణ మంటపం, భారీ సత్రం నిర్మాణం చేయనున్నారన్న పవన్ కల్యాణ్

### మౌళిక సదుపాయలపై భక్తుల నుంచి వినతులు వచ్చాయన్న పవన్ కల్యాణ్



తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారి ఆలయ అభివృద్ధి పనుల కోసం తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) రూ.35.19 కోట్ల నిధులను మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, టీటీడీ ఛైర్మన్ పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా కృతజ్ఞతలు తెలియజేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల తర్వాత తన ఇలవేల్పు శ్రీ ఆంజనేయ స్వామికి మొక్కులు చెల్లించుకునేందుకు కొండగట్టు క్షేత్రాన్ని దర్శించుకున్నానని, ఆ సమయంలో దేవస్థానంలో మౌలిక సదుపాయాలపై భక్తుల నుంచి వినతులు అందాయని ఆయన అన్నారు. దీనిపై ఆలయం వద్ద అభివృద్ధి పనుల కోసం తాను టీటీడీకి ప్రతిపాదన పంపగా, ఆ మేరకు రూపొందించిన ప్రతిపాదనలకు టీటీడీ ఆమోదం తెలిపిందని తెలిపారు. ఈ నిధులతో భక్తుల సౌకర్యార్థం దీక్ష విరమణ మండపం, 96 గదులతో భారీ సత్రం నిర్మాణం చేపట్టనున్నట్లు పవన్ తెలిపారు. ఈ నేపథ్యంలో నిధులు మంజూరు చేసిన టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, పాలక మండలి సభ్యులు, టీటీడీ ఈవో, అడిషనల్ ఈవో, జేఈవోలకు పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, ఈ ప్రతిపాదనలకు సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు పవన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# దేశ వ్యతిరేకి కాంగ్రెస్!



నామ్‌రూప్‌లో రూ.10,601 కోట్ల వ్యయంతో నిర్మించిన భారీ ఎరువుల కర్మాగారాన్ని ఆదివారం ప్రధాని మోదీ ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ కాంగ్రెస్‌ను తీవ్రంగా విమర్శించారు. అక్రమ చొరబాటుదారులను గుర్తించేందుకు చేపట్టిన ఓటర్ల జాబితా సమగ్ర సవరణను కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని, ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే ఈ అడ్డంకులు సృష్టిస్తోందని వ్యాఖ్యానించారు. అస్సాం పట్ల కాంగ్రెస్‌కు ఎప్పుడూ సవతి ప్రేమే తప్ప నిజమైన అభిమానం లేదని మోదీ అన్నారు. అస్సామీల అస్తిత్వం, సంస్కృతి, గౌరవం కాంగ్రెస్‌కు పట్టలేదని, వాటి పరిరక్షణకు బీజేపీ మాత్రమే కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. "కాంగ్రెస్ అనే విషం నుంచి అస్సాంను కాపాడాల్సిన అవసరం ఉంది. ఈ విషయంలో బీజేపీ ఒక కవచంలా నిలుస్తుంది" అని వ్యాఖ్యానించారు. దశాబ్దాల పాటు రాష్ట్రాన్ని వెంటాడిన హింసాకాండకు శాశ్వతంగా తెరదించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దేశానికి కాంగ్రెస్ చేసిన ద్రోహాలు లెక్కకు మించినవని ప్రధాని విమర్శించారు. గత 12 ఏళ్లుగా తమ ప్రభుత్వం వాటిని సరిచేస్తూనే ఉందని, అయినా ఇంకా చక్కదిద్దాల్సిన తప్పిదాలు చాలానే ఉన్నాయని పేర్కొన్నారు. అస్సాం ఆణిముత్యం భూపేన్ హజారికాకు భారతరత్న ప్రకటించడాన్ని కాంగ్రెస్ బహిరంగంగా వ్యతిరేకించిందని గుర్తు చేశారు. "ఆడిపాడే వారికి భారతరత్న ఇస్తున్నాడు" అంటూ కాంగ్రెస్ అస్సామీల మనోభావాలను తీవ్రంగా గాయపరిచిందని మండిపడ్డారు. అస్సాంలో సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటు చేసినప్పటికీ కాంగ్రెస్ దానికీ వ్యతిరేకత వ్యక్తం చేసిందని, పారిశ్రామికీకరణ, కనెక్టివిటీ రాష్ట్ర కలలను సాకారం చేస్తున్నాయంటే ఆ పార్టీకి సహించలేకపోతుందని విమర్శించారు. సభకు మహిళలు భారీగా తరలిరావడం అస్సాంలో మార్పుకు సంకేతమని మోదీ అన్నారు. ఇటీవల రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు అస్సాం బ్లాక్ టీ కానుకగా ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

### విద్యార్థులతో బోటు షికారు

అంతకుముందు ప్రధాని మోదీ బ్రహ్మపుత్రా నదిలో బోటు షికారు చేశారు. క్రూయిజ్ షిప్‌లో విద్యార్థులతో గంటపాటు 'పరీక్షా పే చర్చా' కార్యక్రమంలో పాల్గొన్నారు. పలు పాఠశాలలకు చెందిన 25 మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. గువాహతిలో అస్సాం ఆందోళన అమరవీరుల స్మారకస్తూపం వద్ద మోదీ నివాళులు అర్పించారు. అక్రమ చొరబాట్లకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన వీరులను స్మరించుకుంటూ వెలిగే నిత్య దీపానికి ప్రణామాలు అర్పించారు. రెండు రోజుల అస్సాం పర్యటనతో ప్రధాని పర్యటన ఆదివారంతో ముగిసింది.

# అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది



మండిపడ్డారు. పాలమూరు%-%రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యాన్ని, కేంద్ర ప్రభుత్వ వైఖరిని రెండేళ్లుగా గమనిస్తున్నామని కేసీఆర్ తెలిపారు. "రెండేళ్లుగా తట్టెడు మట్టి కూడా తీయకుండా ఎవరు అడ్డుకుంటున్నారు? తెలంగాణ ప్రయోజనాల విషయంలో బీఆర్ఎస్ ఎట్టి పరిస్థితుల్లో రాజీపడదు. తెలంగాణ హక్కులకు ఒక్క నొక్కు పడినా సహించేది లేదు" అని స్పష్టం చేశారు. పాలమూరు%-%రంగారెడ్డి ప్రాజెక్టు సమగ్ర ప్రాజెక్టు నివేదికను (డీపీఆర్) చంద్రబాబు నాయుడు ఒత్తిడితోనే కేంద్రం వెనక్కి పంపిందని కేసీఆర్ ఆరోపించారు. పర్యావరణ అనుమతులు, ఇతర ప్రధాన అనుమతులు ఉన్నప్పటికీ బీజేపీ తెలంగాణకు శనిలా మారిందన్నారు. మూడు ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన కీలక ప్రాజెక్టును అడ్డుకుంటున్నా రాష్ట్ర ప్రభుత్వం మౌనంగా ఉండటం దారుణమని విమర్శించారు. గోదావరి నుంచి పట్టిసీమ ద్వారా ఏపీకి తరలిస్తున్న 80 టీఎంసీల నీటితో కృష్ణాలో తెలంగాణకు దక్కాల్సిన 45 టీఎంసీలను కలుపుకొని పాలమూరు%-%రంగారెడ్డి ప్రాజెక్టుకు 90.81 టీఎంసీలు కేటాయించిన విషయాన్ని కేసీఆర్ గుర్తుచేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం 45 టీఎంసీలే సరిపోతాయని కేంద్రానికి లేఖ రాయడం తెలంగాణ ప్రయోజనాలకు ఘోర ద్రోహమన్నారు. "గోదావరి జలాల తరలింపుతో కృష్ణాలో ఏపీ వదులుకున్న నీటిని కర్ణాటక, మహారాష్ట్ర వినియోగిస్తుంటే తెలంగాణ ప్రభుత్వం నిద్రపోతోంది" అని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ప్రజాక్షేత్రంలో ఎండగట్టేందుకు భారీ ప్రజా ఉద్యమానికి సిద్ధమవుతున్నట్లు కేసీఆర్ ప్రకటించారు. త్వరలో ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల నేతలతో సమావేశమై గ్రామగ్రామాన కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఆయా జిల్లాల్లో బహిరంగ సభలు నిర్వహించి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామని, ఈ సభలకు తాను స్వయంగా హాజరవుతానని కేసీఆర్ స్పష్టం చేశారు.

# మహాలక్ష్మి పథకంతో లాభాల్లోకి ఆర్టీసీ

వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల ప్రయాణికుల సంఖ్య పెరిగి, సంస్థ ఆదాయం మెరుగుపడిందని తెలిపారు. ఆదివారం ప్రజాభవన్‌లో ఆర్టీసీ, బీసీ సంక్షేమ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, తమ ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు కాస్మొటిక్, మెస్ చార్జీలను రెట్టింపు చేసిందని, ప్రతి మూడు నెలలకోసారి ఆ మొత్తాన్ని చెల్లిస్తున్నామని చెప్పారు. ఆర్టీసీని బలోపేతం చేయడంతో పాటు కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందన్నారు. సంస్థకు కొత్త బస్సులు సమకూర్చుతున్నామని, ప్రభుత్వ సహకారంతో పాటు సంస్థ స్వయంగా ఆదాయాన్ని పెంచుకునే మార్గాలపై దృష్టి పెట్టాలని సూచించారు. మహాలక్ష్మి పథకం కింద ఇప్పటివరకు 255 కోట్ల ఉచిత ప్రయాణాలు నమోదయ్యాయని, ఈ పథకం మహిళా సాధికారతకు బలమైన తోడ్పాటు అందిస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ పీఎఫ్ బకాయిలు రూ.1,400 కోట్లకు చేరగా, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని రూ.660 కోట్లకు తగ్గించామని చెప్పారు. అలాగే సీసీఎస్ బకాయిలను రూ.600 కోట్ల నుంచి రూ.373 కోట్లకు తగ్గించామని వివరించారు. ఉచిత ప్రయాణాల అమలులో మరింత పారదర్శకత తీసుకురావడానికి సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్‌తో ఒప్పందం కుదుర్చుకుని మహిళలకు ప్రత్యేక కార్డులు రూపొందించి పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి మహిళకు ఈ కార్డు అందేలా చూడాలని స్పష్టం చేశారు. ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అవసరమైన ఛార్జింగ్ స్టేషన్లను సిద్ధం చేయాలని సూచించారు. గురుకులాలకు కార్పొరేట్ స్థాయిలో సొంత భవనాల నిర్మాణం



చేపడుతున్నామని కూడా తెలిపారు. సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పోస్టుల భర్తీకి అనుమతి ఇవ్వాలని కోరారు. రెగ్యులర్ కండక్టర్, చీఫ్ ఎకౌంట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి కూడా అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డ్రైవింగ్ లైసెన్సుల జారీకి సంబంధించి యూజర్ ఛార్జీల వసూలుకు, రవాణాశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ కోసం కొత్త వాహనాలు, పన్ను వసూళ్లకు టాబ్స్ మంజూరు చేయాలని ఆయన కోరారు.

### గాజువాక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి గారి ఆదేశాలు మేరకు

# 64వ వార్డు గంగవరంలో వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

### 100 మంది మహిళలకు చీరలు దుప్పట్లు పాలు బ్రెడ్

### 64వ వార్డు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు

### ధర్మాల శ్రీనివాసరావు చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది



వైసీపీ అధినేత...రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు జీవీఎంసీ 64వ వార్డు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ గంటిపిల్లి అమ్మోరు(సలీమ్ ఆధ్వర్యంలో గంగవరం గ్రామంలో ఘనంగా నిర్వహించారు.....ఆదివారం సాయంత్రం జరిగిన ఈ వేడుకలకు వైసిపి 64వ వార్డు అధ్యక్షులు ధర్మాల శ్రీనివాసరావు గారి పాల్గొని అభిమానుల సమక్షంలో గంగవరం వైసీపీ నాయకులు వార్డులో ఉన్న ఇతర కీలక నేతలతో కలిసి కేక్ కట్ చేసి జగన్మోహన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.....ఈ సందర్భంగా ధర్మాల శ్రీనివాసరావు గారి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి 5ఏళ్ళ పాలనలో రాష్ట్ర అభివృద్ధి ఎంతో జరిగిందని అన్నారు...జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తయారు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను పౌష్టికాహారాన్ని అందిస్తూ దేశంలోనే ప్రభుత్వ పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకొచ్చిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందాన్నారు...జగన్మోహన్ రెడ్డి విద్యా వైద్య వ్యవసాయ రంగాలకు పెద్దపీట వేస్తే ఇప్పుడు ఉన్న కూటమి ప్రభుత్వం వాటి అన్నిటిని నిర్వీర్యం చేస్తూ రాష్ట్ర అభివృద్ధిని నాశనం చేస్తుందని విమర్శించారు...రాష్ట్ర ప్రజలకు మంచి జరగాలన్న రాష్ట్రం అన్ని రంగాలలో సంపూర్ణ అభివృద్ధి జరిగి ఈ దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా ఎదగాలంటే అది ఒక జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని జరుగుతుందని చెప్పారు.....64వ వార్డు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ గంటిపిల్లి అమ్మోరు(సలీమ్ మాట్లాడుతూ ముందుగా తమ అధినేత జగన్మోహన్ రెడ్డికీ తమ వార్డులో ఉన్న గంగవరం వైసిపి కుటుంబ సభ్యులు అందరి తరపున జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నాను అన్నారు. రాబోయే ఎన్నికలలో జగన్మోహన్ రెడ్డినీ రాష్ట్ర ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు వైసిపి కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేద్దామని కోరేరు.....ఈ కార్యక్రమంలో 64వ వార్డు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ గంటిపిల్లి అమ్మోరు(సలీమ్ 75వ వార్డు వైసీపీ పరిశీలకులు కొవిరి బాపనయ్య 64వ వార్డు వైసీపీ నాయకులు మాదా అప్పారావు..64వ వార్డు వైసీపీ నాయకులు డి ఎల్ బి నూకరాజు..సాయిబాబా గుడి చైర్మన్ కదిరి సత్తయ్య..గంగవరం పోలింగ్ బూతు ఇన్చార్జులు సింగపూర్ రాజు..కంబాల మల్లేశ్వరరావు..పేర్ల దేవ..కొవిరి సత్యారావు గారు మ...డి ఎస్ వై యూత్ సభ్యులు కొవిరి దేవుడు..ఎరిపిల్లి శ్రీనివాసరావు..కొవిరి బాలు..కంబాల మల్లేష్ గంగవరం కార్యకర్తలు పేర్ల వెంకటేష్..వాసుపల్లి దేవా..కంబాల మధు..కొవిరి సోమేశ్వరరావు..పేర్ల నూకరాజు..ఎరిపిల్లి నూకరాజు..కంబాల సతీష్..నొల్లి స్వామి..సమ్మిడి ప్రవీణు..సమ్మిడి సంతోష్..నొల్లి నూకరాజు.....అధిక సంఖ్యలో గ్రామ యువకులు మహిళలు పాల్గొన్నారు.

# రోడ్డు మీద కాదు.. అసెంబ్లీలోనే నీళ్లపై తేల్చుకుందాం

ఎస్ఎల్‌బీసీ, సీతారామసాగర్, కొడంగల్-నారాయణపేట వంటి కృష్ణా నదిపైని ప్రాజెక్టుల్లో ఒక్కదాన్నైనా కేసీఆర్ పదేళ్ల పాలనలో పూర్తిచేయలేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. కర్ణాటక నుంచి కృష్ణా నీళ్లు తెలంగాణలోకి ప్రవేశించిన వెంటనే వాటిని వినియోగించాల్సిన బదులు, నీరు రాయలసీమకు వెళ్లాక అక్కడి నుంచి తీసుకునేలా నిర్ణయాలు చేశారని ఆరోపించారు. కమిషన్ల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఏపీలోని పట్టిసీమ సహా రాయలసీమ ఎత్తిపోతల పథకాలను కేసీఆర్ స్వయంగా పొగిడారని, ఆ వీడియోలు తమ వద్ద ఉన్నాయని సీఎం తెలిపారు. కేసీఆర్ బహిరంగ సభలు పెట్టే ప్రతిచోటా ఆ వీడియోలను ప్రజలకు చూపిస్తామని స్పష్టం చేశారు. ఏపీ జలదోపిడీకి దోహదం చేసింది కేసీఆర్‌నేనని, ఇప్పుడు మాత్రం ప్రజలను తప్పుదారి పట్టించే మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆర్థిక పరంగా కూడా కేసీఆర్, కేటీఆర్‌లు తెలంగాణను దెబ్బతీశారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై అత్యాచారం చేశారని, భారీ అప్పులు చేసి తెలంగాణను శిథిలావస్థకు నెట్టారని అన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక అప్పుల పునర్వ్యవస్థీకరణ చేసి వడ్డీ భారం తగ్గించామని వివరించారు. కాళేశ్వరం లేకున్నా తమ హయాంలోనే వరి సాగులో తెలంగాణ దేశంలో అగ్రస్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. కేసీఆర్ ఆరోగ్యంగా ఉండాలని, అసెంబ్లీకి వచ్చి నీటి అంశాలపై నిజాయితీగా చర్చించాలన్నదే తమ ఆకాంక్ష అని సీఎం తెలిపారు. రోడ్డు మీద రాజకీయాలు కాదని, సభలోనే నీళ్లు%-%నిజాలు తేల్చుకుందామని మరోసారి స్పష్టం చేశారు.

# రాష్ట్రపతి నిలయంలో ఎట్‌హోం

పలువురు రాష్ట్ర ప్రముఖులు హాజరయ్యారు. రాష్ట్రపతి ఏటా చేపట్టే శీతాకాల పర్యటనలో భాగంగా ఈ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా ఏర్పాటు చేశారు.ప్రతి ఏటా శీతాకాల పర్యటన సందర్భంగా రాష్ట్రపతి హైదరాబాద్ రావడం ఆనవాయతీ. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రంలోని ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు, వివిధ రంగాల ప్రముఖులతో కలిసి 'ఎట్ హోం' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.డిసెంబర్ 17 నుంచి 21 వరకు రాష్ట్రపతి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆమె పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సికింద్రాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్‌కు 'ప్రెసిడెంట్స్ కలర్స్' ప్రదానం చేయడం వంటి అధికారిక కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. తన పర్యటన ముగింపులో భాగంగా రాష్ట్ర ప్రముఖులకు ఈ విందును ఏర్పాటు చేశారు. ఈ ఎట్ హోం కార్యక్రమంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

### అస్సాంలో కాంగ్రెస్‌పై ఆరోపణలు

# రాజకీయ ప్రయోజనాల కోసమే

కాంగ్రెస్ భాగమైందంటూ ప్రధాని చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అసత్యమని ఖండించారు.ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఖర్గే.. కేంద్రంలోనూ, అస్సాంలోనూ బీజేపీ ప్రభుత్వాలే అధికారంలో ఉన్నాయని గుర్తు చేశారు. "భద్రత, చొరబాట్ల నియంత్రణ వంటి అంశాల్లో మీరు విఫలమైతే దానికి బాధ్యత ఎవరిది? మీ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రతిపక్షాలపై నిందలు వేయడం ప్రధాని స్థాయికి తగదు" అని వ్యాఖ్యానించారు. ప్రతిసారీ విపక్షాలపై బురద చల్లడమే బీజేపీ రాజకీయమని విమర్శించారు.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నీరుగారుస్తోందని ఖర్గే ఆరోపించారు. ఈ పథకం గ్రామీణ పేదలకు జీవనాధారమని, వ్యవసాయ కూలీలు, నిరుపేదలను కార్పొరేట్లకు బానిసలుగా మార్చడానికే మోదీ ప్రభుత్వం ఈ చట్టాన్ని ధ్వంసం చేస్తోందన్నారు. ఉపాధి హామీ చట్టం విషయంలో కేంద్ర వైఖరికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగిన మూకదాడి ఘటనను ఖర్గే తీవ్రంగా ఖండించారు. అక్కడి హిందువులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ఆయా ప్రభుత్వాలదేనని పేర్కొన్నారు. ఈ అంశంపై భారత ప్రభుత్వం వెంటనే బంగ్లాదేశ్‌తో చర్చలు జరిపి హిందువుల రక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మొత్తంగా చూస్తే, అస్సాంలో ఎన్నికల వాతావరణాన్ని రెచ్చగొట్టేందుకు మోదీ కాంగ్రెస్‌పై ఆరోపణలు చేస్తున్నారని ఖర్గే ఆరోపించారు. చరిత్రను వక్రీకరించి, ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించే ప్రయత్నాలను కాంగ్రెస్ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదని స్పష్టం చేశారు.

### 420 హామీలను మూసీలో కలిపారా?

# లేక గాంధీభవన్‌లో పాతరేశారా?

ఆయన ఆరోపించారు. విజన్ డాక్యుమెంట్ పేరుతో కొత్త హామీల పల్లవి అందుకుంటూ ఒకరినొకరు అభినందించుకుంటు న్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు మరోసారి కొత్త హామీలతో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తోందని అన్నారు. ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న 420 హామీలను మూసీలో కలిపేశారా? లేక గాంధీభవన్‌లో పాతరేశారా? అన్న విషయాన్ని తెలంగాణ ప్రజలకు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. కొత్త హామీలు ఇచ్చే ముందు గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఇచ్చిన మాటపై నిలబడాలని ప్రజలు కోరుకుంటున్నారని కిషన్‌రెడ్డి హెచ్చరించారు. లేకపోతే కాంగ్రెస్ ప్రకటించిన అభయహస్తమే ప్రజల ఆగ్రహంగా మారి భస్మాసుర హస్తంగా పరిణమించి అధికారానికి దూరం చేస్తుందని పేర్కొన్నారు. గ్యారంటీల పేరుతో రైతులు, మహిళలు, నిరుద్యోగులు, విద్యార్థులు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలకు ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలని కోరారు. హామీల అమలులో మోసం చేస్తే భవిష్యత్తులో తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని తన లేఖలో కిషన్‌రెడ్డి హెచ్చరించారు.

## మహారాష్ట్ర స్థానిక పోరులో మహాయుతి హవా

మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార మహాయుతి ఘన విజయంఅతిపెద్ద పార్టీగా అవతరించిన బీజేపీ.. 129 స్థానాలు కైవసంఇది మోదీ పాలనకు లభించిన ప్రజామోదమన్న అమిత్ షాఓటమిని అంగీకరించిన విపక్షాలు.. ఎన్నికల సంఘంపై ఆరోపణలుషిండే, అజిత్ పవార్లను బీజేపీ వదిలించుకుంటుందన్న కాంగ్రెస్‌మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార మహాయుతి కూటమి విజయదుందుభి మోగించింది. మొత్తం 288 నగర పరిషత్, పంచాయతీ స్థానాలకు వెలువడిన ఫలితాల్లో, బీజేపీ 129 స్థానాలు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ నాయకత్వంలోని మహాయుతి కూటమి ఈ ఎన్నికల్లో స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించింది.ఈ విజయంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. "ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాయని, ఈ విజయమే అందుకు నిదర్శనం, ఇది ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదం" అని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ, "ఈసారి ఎన్నికల్లో నేను ఏ నాయకుడిని, ఏ పార్టీని విమర్శించలేదు. కేవలం నా ప్రణాళికలను వివరించి 100 శాతం సానుకూల ప్రచారం చేశాను. ప్రజలు దానిని ఆమోదించారు" అని తెలిపారు.మరోవైపు, ప్రతిపక్ష కాంగ్రెస్, శివసేన (యూబీటీ) తమ ఓటమిని అంగీకరించాయి. మహాయుతి గెలుపునకు ఎన్నికల సంఘం సహకరించిందని ఆరోపించాయి. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ హర్షవర్ధన్ సప్కల్... బీజేపీ మిత్రపక్ష నేతలైన ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్‌లకు హెచ్చరిక జారీ చేశారు. "బీజేపీ సాధించిన ఈ విజయం షిండే, అజిత్ పవార్లకు ఒక మేల్కొలుపు. బీజేపీ నూటికి నూరు శాతం ఈ ఇద్దరు మిత్రపక్ష నేతలను వదిలించుకుంటుంది" అని ఆయన వ్యాఖ్యానించారు.దాదాపు దశాబ్దం తర్వాత జరిగిన ఈ స్థానిక సంస్థల ఎన్నికలకు డిసెంబర్ 2, 20 తేదీల్లో పోలింగ్ జరగ్గా, నేడు ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఈ ఫలితాలు రాబోయే బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ఎన్నికలకు ముందు మహాయుతి కూటమికి భారీ ఉత్సాహాన్ని ఇచ్చాయి.

# ప్రజాసేవకే నా జీవితం అంకితం

## అరకు పార్లమెంట్ అధ్యక్షురాలిగా అవకాశం కల్పించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు




మోజూరుతేజావతి...!..: నవతరం: అరకు: అరకు పార్లమెంట్ అధ్యక్షురాలిగా నన్ను నియమించినందుకు తెలుగుదేశం పార్టీ అధినాయకత్వానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని మోజూరు తేజావతి తెలిపారు. జ్ఞానాన్ని బోధించే ఉపాధ్యాయ వృత్తి నుండి, సమాజ దిశను మార్చే ప్రజా రాజకీయాల్లోకి అడుగుపెట్టిన నాకు, తెలుగుదేశం పార్టీ ఈరోజు ఒక గొప్ప బాధ్యతను అప్పగించిందన్నారు. నాపై నమ్మకం ఉంచి ఈ కీలక బాధ్యతను అప్పగించిన పార్టీ జాతీయ అధ్యక్షులు గౌరవనీయులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పల్లా శ్రీనివాస్ గారికి, పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ నారా లోకేష్ గారికి, రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ అచ్చం నాయుడు గారితో పాటు ఇతర ముఖ్య నేతలకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిలో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దిన తాను, ఇప్పుడు సమాజంలోని ప్రతి పౌరుడి భవిష్యత్తు కోసం, ముఖ్యంగా అరకు పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తానని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తి నేర్పిన క్రమశిక్షణ, నిబద్ధతలను రాజకీయ జీవితంలోనూ పాటిస్తానని స్పష్టం చేశారు. తనకు అండగా నిలుస్తున్న పార్టీ కార్యకర్తలకు ప్రత్యేక వందనాలు తెలియజేస్తూ, నన్ను తమలో ఒకరిగా స్వీకరించి, మద్దతుగా నిలుస్తున్న తెలుగు తమ్ముళ్ల సహకారంతో పార్టీని మరింత బలోపేతం చేస్తానన్నారు. ప్రజల సమస్యలే తన అజెండా అని, సామాన్యుడి గొంతుకగా పార్లమెంట్ స్థాయిలో సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతానని తెలిపారు. డబుల్ ఇంజన్ సర్కార్లో కీలకమైన ప్రాంతీయ సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు మరియు రాజకీయాలకతీతంగా పార్లమెంట్ పరిధిలోనే కాకుండా ఈ ప్రాంతంలోని ఉన్న అన్ని సమస్యల మీద తనదైన శైలిలో ప్రయత్నించేందుకు కృషి చేస్తానని ఆమె తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలను ఇంటింటికీ తీసుకెళ్లే బాధ్యతను పూర్తి అంకితభావంతో నిర్వర్తిస్తానన్నారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు ప్రతి ఒక్కరిని కలుపుకుంటూ, రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ విజయకేతనం ఎగురవేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతానని తెలిపారు.

ఈ సందర్భంగా అనకాపల్లి పర్యటనకు వచ్చిన పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారిని కలిసి, పార్టీ తనకు అప్పగించిన బాధ్యతను అత్యంత విశ్వసనీయంగా, నిబద్ధతతో నిర్వర్తిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. వ్యక్తిగత స్వార్థం లేకుండా వ్యవస్థ ప్రయోజనాల కోసం పనిచేస్తూ, పార్టీ నాయకత్వానికి మరియు ప్రజలకు జవాబుదారీగా ఉంటానని మోజూరు తేజావతి ఈ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు

# తిరుమల తిరుపతి దేవస్థానంకు రూ. 35.19 కోట్లు

## హర్షం వ్యక్తం చేసిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్



హైదరాబాద్, నవతరం: కొండగట్టు ఆంజనేయ స్వామి దర్శనానికి వచ్చే భక్తుల కోసం 96 గదుల సత్రం నిర్మించడానికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సిఫార్సుతో తిరుమల తిరుపతి దేవస్థానమ్ కు రూ. 35.19 కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు బండి సంజయ్ కుమార్. కొండగట్టు దర్శనానికి వచ్చే భక్తులకు ఈ సదుపాయం ఎంతో ఉపయోగపడుతుంది. కొండగట్టు అభివృద్ధి కోసం రూ. 100కోట్లు కేటాయిస్తామని చెప్పిన నాటి బీఆర్ఎస్ చిల్లిగవ్వ ఇవ్వలేదు. కాంగ్రెస్ నయా పైసా ఇవ్వకపోగా ఆర్జిత సేవల ఛార్జీలను సైతం పెంచి భక్తులపై భారం మోపిందని ధ్వజమెత్తారాయన. భక్తులకు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందిపడుతున్నా నాటి అధికార బీఆర్ఎస్, నేటి అధికార కాంగ్రెస్ పార్టీలు పట్టించుకోలేదు. కాంగ్రెస్ పాలకులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే కొండగట్టు ఆలయానికి నిధులు కేటాయించి, అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలన్నారు కేంద్ర హెూమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్.



## మేడారం జాతర పోస్టర్ ఆవిష్కరించిన రేవంత్

హైదరాబాద్, నవతరం: జూబ్లీహిల్స్ నివాసంలో మేడారం మహా జాతర 2026 పోస్టర్‌ను ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, దనసరి అనసూయ (సీతక్క), పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పాల్గొన్నారు. మేడారం మహా జాతర జనవరి 28 నుంచి 31, 2026 వరకు జరగనుంది.


## హైడ్రా కమిషనర్ గన్‌మెన్ ఆత్మహత్యాయత్నం




హైదరాబాద్, నవతరం: హైదరాబాద్ హయత్‌నగర్ ప్రాంతంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు గన్‌మ్యాన్‌గా పనిచేస్తున్న కృష్ణ చైతన్య ఆత్మహత్యాయత్నం చేయడం కలకలం రేపింది. కృష్ణ చైతన్య శనివారం ఉదయం తన నివాసంలో తన వద్ద ఉన్న సర్వీస్ తుపాకితో కాల్చుకుని ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు వెంటనే గమనించి అతడిని సమీప ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రాథమిక విచారణలో, కృష్ణ చైతన్య ఇటీవల ఓ బెట్టింగ్ యాప్‌లో భారీ మొత్తంలో డబ్బులు కోల్పోయినట్టు తెలుస్తోంది. ఆర్థిక ఇబ్బందులే అతడి ఆత్మహత్యాయత్నానికి కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే ఈ ఘటనపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. విషయం తెలిసిన వెంటనే హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆస్పత్రికి చేరుకుని గన్‌మ్యాన్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆర్థిక సమస్యల కారణంగానే ఈ ఘటన చోటు చేసుకున్నట్టు ప్రాథమిక సమాచారం ఉందని, ఈ అంశాన్ని అనవసరంగా సంచలనంగా మార్చవద్దని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## @ ఇనప కచ్చడాలు
## స్త్రీని ఎంతగా లైంగికఅవయవంచేసాం?

**సిగ్గు (మాలిన) బిళ్ల**



సిగ్గు బిళ్ల కోసం చాలా మందికి తెలుసు ఆడపిల్లలకు చిన్నపుడు సిగ్గుబిళ్ల మర్మాంగానికి అడ్డుగా కడతారు కాని ఇనప కచ్చడం కోసం ఎంతమందికి తెలుసు

మన నీచ, నికృష్ఠ సంస్కృతికి, ధారుణమైన తీరుకు ఒక నిదర్శనం ఒక అకృత్యాన్ని అందంగా భరించే నీచ స్థితికి ఉదాహరణ మన సంస్కృతిలో మొదటి నుంచి మహిళలను చిన్న చూపు చూస్తూనే ఉన్నాము... నేటికీ అది అమలు జరుగుతుంది ముఖ్యంగా "స్త్రీకి మాత్రమే శీలం ఉంది పురుషులకు అవసరం లేదు" అనే చెత్త విధానం మన పనికిమాలిన పూర్వికులు కొందరు పెట్టారు దానిని చాలా నిష్టగా అమలు చేస్తూ వచ్చారు

ఆడవారి శీలానికి రక్షణ ఉండాలని కొందరు నికృష్టులు భావించారు అందుకే ఇనపకచ్చడాల పద్దతిని అమలు చేశారు అసలు ఏమిటీ

**ఈ ఇనపకచ్చడం ఏమా కథ? తెలుసుకోవాలంటే ఇదిగో చదవండి...**

పూర్వకాలంలో మన సంస్కృతి ఎన్నో మార్పులు చెందుతూ వచ్చింది అందులో ఆడవారిని అవమానం చేస్తూ సాగిన అపచారాలు ఎన్నో ఉన్నాయి వాటిలో ఒక నీచమైన ఆచారమే ఇనపకచ్చడాలు

భర్తలు దూర ప్రాంతాలకు వెళ్లినపుడు భార్యల శీల రక్షణగా ఏర్పాటు చేసేదే ఇనపకచ్చడం అయినా అర్థం కాలేదు కదా వివరంగా వినండి...

ఇపుడు స్త్రీలు డ్రాయర్లు ధరిస్తున్నారు కదా ఇదే ఇనప లోహంతో ఆ డ్రాయిర్ ను తయారు చేస్తే ఎలా ఉంటుంది.? అదే ఇనపకచ్చడం స్త్రీల యోనికి అడ్డుగా ఒక లోహాన్ని తయారు చేసి దానికి అనుబంధంగా ఉన్న వడ్డానం వంటి రింగ్ ను నడుముకు చుట్టూ బిగిస్తారు దానికి ఒక తాళం వేస్తారు

ఆ తాళం పట్టుకుని భర్తలు దూర ప్రాంతాలకు వెళతారు వాళ్లు తిరిగి వచ్చే వరకూ దానిని ఓపెన్ చేసే అవకాశం ఉండదు భర్త తిరిగి వచ్చిన తరువాతే తాళంతో ఇనపకచ్చడం ఓపెన్ చేసి తరువాత సంభోగించాలి భర్త ఇంట్లో లేనపుడు ఇలా ఇనప కచ్చడం బిగించి వెళతాడు ఇతర పురుషులతో శృంగారంలో పాల్గొంటుందనే భయంతో ఆనాటి మగాళ్లు అలా చేసేవారు ముఖ్యంగా సైనికులు యుద్ధానికి వెళితే కొన్ని నెలల పాటు వచ్చేవారు కాదు. అందుకే ఈ ఏర్పాటు చేసేవారు...

అయితే మహిళలు దీనిని ధరించటం చాలా కష్టం దీనిని ధరించిన తరువాత శరీరం గాయాలకు గురయ్యేది దీనిని తొలిగించాల్సి వచ్చినపుడు కూడా చాలా ఇబ్బంది అయ్యేది ఒక్కొక్కసారి రక్తాలు కారేవి అయినప్పటికీ ఆనాటి స్త్రీలు వీటిని ధరించే వారు ఇక ఇనపకచ్చడం తయారీ కూడా ప్రత్యేకంగా ఉండేది మల, మూత్ర విసర్జనలకు అవకాశం ఉండేలా

ఆ ప్రాంతాల్లో రంధ్రాలు ఉండేవి అయినప్పటికీ మల, మూత్ర విసర్జనలకు కష్ట పడాల్సి వచ్చేది మగాళ్లు తమ అహంకారాన్ని చాటుకోవటానికి దీనిని అలంకారంగా మార్చి మహిళలకు బిగించేవారు...

అప్పట్లో స్త్రీలు కూడా దీనిని మొదట్లో భరించినా తరువాత కాలంలో ఇదొక అలంకారంగా స్వీకరించారు చాలా మంది గొప్పగా చెప్పుకునేవారు పైగా కచ్చడం లేకపోతే వారు తప్పు చేసేవారిని అనుకుంటారని ప్రతీ ఒక్క మహిళా భర్తి బతమాలుకుని మరీ కచ్చడం చేయించుకునేవారు యోనికి అడ్డుగా శీలానికి రక్షణగా ఉంటుందని అందరూ అనేవారు కొంతమంది వారి స్థాయిని బట్టి కచ్చడాలు చేయించుకునేవారు పేదవారు ఇనుము లోహంతో చేయించుకుంటే, కొందరు వెండి, బాగా ఉన్న వాళ్లు బంగారంతో కూడా కచ్చడాలు చేయించుకునేవారు కాలక్రమంలో అవి తోలుతో కూడా చేయించుకునేవారు%ఎ%దీంతో కొంత సౌకర్యం ఉండేదట...

ఇలా క్రీ.శ.2వ శతాబ్ధం నుంచి కొన్ని శతాబ్ధాలపాటు ఈకచ్చడాలు ధరించే నీచ సంస్కృతి మన సంప్రదాయంలో ఉంది అంతే కాదు కొన్ని యూరోపియన్ దేశాల్లో కూడా ఇది అమల్లో ఉండేది కొన్ని మాతృస్వామ్య రాజ్యాల్లో అయితే పురుషులకు కూడా మర్మవయానికి అడ్డుగా కచ్చడం వేసేవారట...

ఇలా తరువాత కాలంలో ఈకచ్చడాలే సిగ్గుబిళ్లగా మారాయి అతి మగపిల్లలకు అయితే గానుగ కాయ వంటివి మొలకు కట్టేవారు దీనికి మర్మవయువాల నుంచి దృష్టి తరలించటమే కారణంగా చెబుతారు ఈ ఇనప కచ్చడాల సంస్కృతిని ప్రముఖ రచయత తాపీ ధర్మారావు తన రచనల్లో వాస్తవాలు చెబుతూనే వ్యవస్థను కడిగిపారేశారు నేటికి ఇలాంటి నీచ ఆచారాలు ఎన్నో మన సంస్కృతిలో భాగంగా ఉండిపోయాయి...

కులవ్యవస్థ, స్త్రీలకు సమాన ప్రాతినిధ్యం ఇవ్వకపోవటం, మూఢనమ్మకాలు ఇలా చెప్పుకుంటూ పోతే మనిషి ఆత్మాభిమానాన్ని తీసే చాలా విషయాలు మనం గొప్పగా

చెప్పుకుంటూ బతికేలా చేస్తున్నాయి ఇలాంటి వాటిపై ఆలోచించటం, ప్రశ్నించటం, తిరగబడటం అందరూ అలవాటు చేసుకున్నపుడే కొన్నేళ్లకైనా సమాజం మారుతుంది...



# వైద్యరంగంపై దృష్టి పెట్టాలి

## అలంపూర్ లోని వందపడకల ఆసుపత్రిని సందర్శిన జాగృతి బాస్

అలంపూర్, నవతరం: జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ లోని వంద పడకల ఆస్పత్రిని సందర్శించారు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత. ఈ సందర్భంగా రోగులు, డాక్టర్లు, వైద్య సిబ్బందితో మాట్లాడి ఆస్పత్రిలో ఉన్న సదుపాయాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా వైద్య రంగంపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేస్తున్నానన్నారామె. ఆలంపూర్ ప్రభుత్వ హాస్పిటల్ చాలా నాసిరకంగా కట్టి మూడేళ్ల పాటు వాడలేదు, ఇక్కడ అన్ని ఖాళీగా ఉన్నాయి. వసతులు, సౌకర్యాలు ఏమీ లేవు, 15 జిల్లాల్లో కూడా ప్రభుత్వాస్పత్రుల్లో ఇదే పరిస్థితి ఉందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు.

# నిజాంల నాటి చెరువుకు ప్రాణంపోసిన హైడ్రా

## బమ్ రుక్న్ ఉద్ దౌలా చెరువు ప్రారంభానికి సన్నాహం

## అభివృద్ధి పనులను పరిశీలించిన హైడ్రా కమిషనర్






హైదరాబాద్, నవతరం: పాతబస్తీలో నిజాంల నాటి చారిత్రక చెరువుకు హైడ్రా ప్రాణం పోసింది. కబ్జాలను తొలగించి ఊపిరిలూదింది. ఆక్రమణలతో ఆనవాళ్లే కోల్పోయిన చెరువును బతికించింది. చరిత్రను తవ్వితీసిన మాదిరి చెరువును రూపొందించి చారిత్రక వైభవాన్ని హైడ్రా చాటింది. ఇలా పాతబస్తీకే మణిహారంగా బమ్ రుక్న్ ఉద్ దౌలా చెరువును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతోంది. జనవరిలో ఈ చెరువును ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శనివారం బమ్ రుక్న్ ఉద్ దౌలా చెరువు అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కాలగర్భంలో కలిసిపోయిందనుకున్న చరిత్రకు ప్రాణం పోస్తున్నాం.. ప్రతి విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్ ఈ సందర్భంగా అక్కడ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న అధికారులను ఆదేశించారు. చెరువుకు స్థానికులు సులభంగా చేరుకునేలా రహదారులతో పాటు ప్రవేశ ద్వారాలుండాలని సూచించారు. చెరువు చుట్టూ బండ్‌పై వాకింగ్ ట్రాక్‌లను పరిశీలించారు. చెరువు లోపలి వైపు ఫెన్సింగ్ పనులను పరిశీలించారు. చిన్నారులు ఆడుకునేందుకు ఇరువైపులా ఏర్పాటు చేస్తున్న ప్లే ఏరియాలను పరిశీలించారు. వృద్ధులు సేద దీరే విధంగా అక్కడ గజబోలు నిర్మాణాలు నలువైపులా ఉండేలా చూడాలన్నారు. పార్కులు, ఓపెన్ జిమ్‌ల ఏర్పాట్లను పరిశీలించారు. కాంక్రీట్ జంగిల్‌గా నగరాలు మారిపోతున్న వేళ.. పాతబస్తీలో నేషనల్ పోలీస్ అకాడమీకి చేరువలో అభివృద్ధి చేస్తున్న బమ్ రుక్న్ ఉద్ దౌలా చెరువు విహార కేంద్రంగా తీర్చిదిద్దాలని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారు తీర్చిదిద్దాలన్నారు. ఔషధ గుణాలున్న వృక్ష జాతితో పాటు.. మొక్కలను చెరువు చుట్టూ నాటాలని సూచించారు. పచ్చిక బైళ్లతో పార్కులు ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలన్నారు. బయటకు చెరువు పరిసరాల్లో ఉన్న ఉష్ణోగ్రతల్లో తేడా తెలిసేలా.. పచ్చని వాతావరణం ఉండేలా చూడాలన్నారు. నిజాంల కాలంలో చెరువు నిర్మాణంలో వాడిన రాతిని వినియోగించి కట్టడాన్ని పటిష్టం చేయాలన్నారు.



ఇన్‌లెట్‌లు, ఔట్‌లెట్‌లు విశాలంగా ఉండేలా చేపట్టిన నిర్మాణాలను చూశారు. రాజేంద్రనగర్, ఆరాంఘర్ ఇలా 10 కిలోమీటర్ల మేర చెరువుకు వర్షం నీరు వచ్చేలా ఇన్‌లెట్లు నిర్మించాలని.. ఈ ప్రాంతంలో వరద కష్టాలకు ఈ చెరువు చెక్‌పెట్టేలా చూడాలని సూచించారు. సీసీటీవీ కెమేరాలను ఏర్పాటు చేసి నిఘాను పటిష్టం చేస్తున్నారు. 1970లో మూడవ నిజాం సికందర్ జాహ్ పాలనలో అప్పటి ప్రధానమంత్రిగా ఉన్న నవాబ్ రుక్న్ ఉద్ దౌలా ఈ చెరువును నిర్మించారని.. అందుకే బమ్ రుక్న్ ఉద్ దౌలా చెరువు పేరు వచ్చిందని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. తాగు నీటి అవసరాలను తర్చేలా 104 ఎకరాల మేర ఈ చెరువు విస్తరించి ఉందని చరిత్ర చెబుతోంది. కాలక్రమంలో చెరువు విస్తీర్ణం తగ్గుతూ హెచ్ ఎం డీ ఏ ఈ చెరువును 17.05 ఎకరాలుగా నిర్ధారించింది. చివరికి 4.12 ఎకరాలుగా మిగిలిపోయింది. హైడ్రా గత ఏడాది ఆగస్టులో ఆక్రమణలను తొలగించింది. హెచ్ ఎం డీ ఏ పేర్కొన్న విధంగా పూర్తి స్థాయిలో భూమి అందుబాటులోకి తెచ్చింది. ఆక్రమణలు తొలగిస్తున్నప్పుడు అనేక అవరోధాలను అధిగమించి.. విమర్శలను ఎదుర్కొంది. అలా విమర్శించిన వారే ఔరా అనేట్టు హైడ్రా ఈ చెరువును అభివృద్ధి చేసింది. ఇప్పుడు స్థానికులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కలలో కూడా ఊహించడం కష్టంగా ఉన్న ఈ ప్రాంతానికి ఇంత అందాన్ని తీసుకువచ్చిన హైడ్రాకు అభినందనలు తెలుపుతున్నారు. అడుగడుగునా చారిత్రక ఆనవాళ్లు, ఎన్నో విశేషాలు స్థానికంగా ఉన్న వృద్ధులు పలు విధాలుగా వివరిస్తున్నారు. రాజేంద్రనగర్, ఆరాంఘర్, కాటేదాన్ ప్రాంతాల నుంచి వచ్చే వరద ఈ చెరువుకు చేరేదని చెబుతున్నారు. నిజాంల కాలంలో మీరాలం ట్యాంక్‌ను రాజులు, బమ్ రుక్న్ ఉద్ దౌలా చెరువును రాణులు స్నానాలకు వినియోగించేవారని చెబుతున్నారు. అలాగే బమ్ రుక్న్ ఉద్ దౌలా చెరువులో వనమూలికల చెట్లు, కొమ్మలు వేసి.. ఆ దిగువన నిర్మించిన బావిలోకి వచ్చిన ఊట నీటిని తాగేందుకు నిజాం పాలకులు వినియోగించేవారని మరి కొంతమంది వివరిస్తున్నారు. ఔషధగుణాలున్న ఈ నీటిని మాత్రమే నిజాంలు వినియోగించేవారంటున్నారు. అంతే కాదు.. ఈ చెరువు చుట్టు సువాసనలు వెదజల్లే పూల మొక్కలు విరివిగా ఉండేవని.. ఆ పూలన్నీ చెరువులో పడడంతో ఇక్కడి నీటిని సెంటు తయారీకి వినియోగించేవారని.. ఇందుకోసం అరబ్ దేశాలకు ఇక్కడి నీరు తీసుకెళ్లేవారంటున్నారు. ఇలా ఎంతో చరిత్ర ఉన్న ఈ చెరువు మళ్లీ పునరుద్ధరణకు నోచుకోవడం చాలా ఆనందంగా ఉందని పలువురు సంబర పడుతున్నారు.

# ఉపాధి చట్టం ఉసురుతీయొద్దు

### కుత్బుల్లాపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్




హైదరాబాద్, నవతరం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరును మార్చాలన్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడ్చల్ ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ గ్రామీణ పేదల చెమటతో నడిచే చారిత్రాత్మక ఉపాధి పథకం నుంచి మహాత్మా గాంధీ పేరు తొలగించడం గాంధీజీకి మాత్రమే కాదు, దేశంలోని కోట్లాది గ్రామీణ పేదలకు చేసిన ఘోర అవమానమని మండిపడ్డారు. ఇప్పటికే ఈ పథకానికి నిధులు తగ్గించడం, బకాయిలు పెంచడం, పనిదినాల్లో కోతలు విధించడం ద్వారా గ్రామీణ ఉపాధి హక్కును బలహీనపరుస్తున్న కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు రాజకీయ ద్వేషంతో మహాత్మా గాంధీ పేరు కూడా తొలగించాలనుకోవడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. యూపీఏ ప్రభుత్వం హయాంలో అప్పటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్, యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ సంకల్పంతో గ్రామీణ పేదలకు గౌరవప్రదమైన ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఈ పథకం ద్వారా గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు గణనీయంగా తగ్గాయని, నిరుపేద కుటుంబాలకు జీవనాధారం కలిగిందని పేర్కొన్నారు. ఈ రోజు మోదీ ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరును తొలగించడం అంటే గ్రామీణ భారతానికే అవమానమని, ఇది గ్రామీణ ఉపాధి హక్కును నిర్వీర్యం చేసే కుట్రగా కాంగ్రెస్ పార్టీ భావిస్తోందని స్పష్టం చేశారు. మహాత్మా గాంధీ పేరును తొలగించే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని, లేకపోతే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తుందని హెచ్చరించారు.

ఈ నిరసన కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తోటకూర వజ్రేస్ యాదవ్, కుత్బుల్లాపూర్, ఉప్పల్ నియోజకవర్గాల కాంగ్రెస్ ఇన్‌చార్జీలు కోలన్ హనుమంత్ రెడ్డి, మందమల్ల పరమేశ్వర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సీనియర్ నాయకులు భూపతి రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహా యాదవ్, జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మి, ఓబీసీ సెల్ అధ్యక్షులు రవి ముదిరాజ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు పత్తి కుమార్, ఎస్టీ సెల్ అధ్యక్షులు గణేష్, సేవాదళ్ అధ్యక్షులు షఫీఉద్దీన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొమ్మక్ అజయ్, సిహెచ్ బుచ్చిరెడ్డి, మోతే శ్రీనివాస్ యాదవ్, బాలప్ప, కూన రాఘవేంద్ర గౌడ్, రమేష్ మంజుల్కర్, షాకీర్, కృష్ణ యాదవ్, చోటు, తోకల శ్రీను, తోఫిక్, ప్రసాద్, సుజిత్ రెడ్డి, భూషణం గౌడ్, జహంగీర్, రాజిరెడ్డి, అఖిల్, రామకృష్ణారెడ్డి, భరత్, నరసింహారావు, మురళి, వీరబాబు, నరేందర్ మరియు అన్ని నియోజకవర్గాల ఏ అండ్ బి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మున్సిపల్ అధ్యక్షులు, కార్పొరేషన్ డివిజన్ అధ్యక్షులు, మాజీ మేయర్లు, మాజీ చైర్మన్లు, మాజీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, ఎస్సీ, బీసీ, మైనారిటీ, ఎస్టీ, సేవాదళ్ విభాగాల నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొని నిరసనకు మద్దతు తెలిపారు.

# గాంధీ పేరుని తొలగిస్తే భారతజాతినే అవమానించినట్టు

### కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి

కుత్బుల్లాపూర్ / హైదరాబాద్, నవతరం: టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశానుసారం మేడ్చల్ మల్కాజ్గిరి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వజ్రెష్ యాదవ్ ఆధ్వర్యంలో మేడ్చల్ ఎంఆర్ఓ కార్యాలయం దగ్గర ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి మాట్లాడుతూ... మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మహాత్మా గాంధీ పేరును తొలగించడం నరేంద్ర మోడీ, అమిత్ షా రాజకీయ కుటిల మనస్తత్వానికి నిదర్శనమని పేర్కొంటూ, ఈ పథకం 2వ తారీఖు ఫిబ్రవరి 2006 అప్పటి యూపీఏ చైర్ పర్సన్ సోనియా గాంధీ, ప్రధాని మన్మోహన్ సింగ్ గ్రామీణ ప్రాంతాలలో పేదలకు ఉపాధి హామీ కోసం ఏర్పాటు చేశారని దీని ముఖ్య ఉద్దేశం గ్రామీణ పేద కుటుంబాల జీవనోపాధి భద్రతను పెంచడం, సంవత్సరంలో 100 రోజుల ఉపాధి కల్పించడం దీనికి జాతిపిత మహాత్ముని పేరు పెట్టడం జరిగింది. కానీ ఇప్పుడున్న బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరు తొలగించి పేదల ఉపాధిని తూట్లు పొడిచేందుకు సన్నద్ధం అవుతుందని ఇది వారి కుటిల రాజకీయ నిదర్శనమని, భారతదేశంలో మహాత్మా గాంధీ పేరుని వారి చరిత్రని తొలగించాలని చేస్తున్న బిజెపి ప్రయత్నం ఎప్పటికీ సఫలీకృతం కాదని, భారతదేశం ఉన్నంతకాలం మహాత్ముని పేరు,ఆశయాలు కొనసాగుతూనే ఉంటాయని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్ళు తెరిచి దేశ ప్రజల మనోభావాలను గౌరవిస్తూ ఉపాధి హామీ పథకంలో మహాత్మా గాంధీ పేరుని కొనసాగించాలని కోరారు.




# ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించిన అరికెపూడి గాంధీ

### హర్షం వ్యక్తం చేసిన నిర్వాహకుడు, బీసీ నాయకుడు తెల్ల హరికృష్ణ

కూకట్ పల్లి, నవతరం: వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని మాధవరం కాలనీలో ఆర్.ఎన్.సి హాస్పిటల్ సౌజన్యంతో, తేళ్ల హరికృష్ణ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శేర్లింగంపల్లి ఎమ్మెల్యే పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఓబీసీ వర్కింగ్ చైర్మన్ తూము వినయ్ కుమార్, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు పాల్గొన్నారు, ఈ సందర్భంగా తేళ్ల హరికృష్ణ మాట్లాడుతూ.. రోజువారి జీవనశైలిలో ప్రజలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, దీనిని నివారించేందుకు తమ వంతు కృషిగా తెల్ల హరికృష్ణ, దాసరి రాహుల్ ప్రదీప్ మిత్ర మండలి గత ఆరు నెలలుగా హైదర్ నగర్, ఆల్విన్ కాలనీ, వివేకానంద నగర్ కాలనీ డివిజన్లో పలుచోట్ల బ్లడ్ డొనేషన్, హై టెస్టింగ్ క్యాంప్, హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇది నాలుగో క్యాంప్ నిర్వహిస్తున్న వైద్య శిబిరమని పేర్కొన్నారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, థైరాయిడ్, జీఆర్‌బీఎస్, సీబీపీ, ఈసీజీ పరీక్షలతో పాటు డాక్టర్ కన్సల్టేషన్ మరియు ఉచిత మందులు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మందికి పైగా కాలనీవాసులు పాల్గొని వైద్య సేవలను ఉపయోగించుకున్నారని తెలియజేశారు.





# బీసీ రిజర్వేషన్ల కోసం ర్యాలీ తీస్తే కేసులా?

### అక్రమ కేసులను ఎత్తివేయాలి.. సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్

కుత్బుల్లాపూర్, నవతరం: గత నెల 18 నాడు రాష్ట్రంవ్యాప్తంగా బీసీ బందు పిలుపులో భాగంగా షాపూర్ నగర్ లో వామపక్షాల ఆధ్వర్యంలో బందును జయప్రదం చేయాలని కోరుతూ ర్యాలీ తీయడం జరిగింది. ఈ ర్యాలీ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకున్నా, దాడులు విధ్వంసాలు చెయ్యకుండా శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తే కేసులు వేయడం సిగ్గుచేటుకరమని ప్రభుత్వమేమో బీసీ రిజర్వేషన్లకు సంపూర్ణ మద్దతు తెలియజేసి బీసీ బందును కూడా జయప్రదం చేస్తే ఇక్కడ అధికారులు ఏమో కేసులు వేయడం అనేది చాలా ఘోరమని ఇది బీసీ వ్యతిరేకతను సూచిస్తుందని ఇప్పటికైనా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బీసీ బందు సందర్భంగా నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, సిపిఐ మండల కార్యదర్శి కే స్వామి సిపిఎం మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ లు నేడు మేడ్చల్ కోర్టులో హాజరై అనంతరం పై ప్రకటనను విడుదల చేశారు.

### ప్రభుత్వ భూములను కాపాడండి మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ ను కోరిన కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, నవతరం: కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలోని పలు సమస్యల పరిష్కారానికి సహకారం అందించాలని, గాజులరామారం తదితర ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు కృషిచేయాలని కోరుతూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గ సభ్యుడు ఈటెల రాజేందర్ ను వారి స్వగృహంలో కలిసి కోరారు. గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరైన అభివృద్ధి పనులు కూడా ఈ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని ప్రజా సమస్యల పరిష్కారానికి పార్లమెంట్ సభ్యుడిగా సహకారం అందించాలని కోరగా ఎంపీ ఈటెల రాజేందర్ సానుకూలంగా స్పందించారు. అదేవిధంగా మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న గాజులరామారం గ్రామ సర్వే నంబర్ 307 లోని సుమారు 317 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూముల్లో ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న పేదల జోలికి వెళ్లకుండా పట్టాభూముల పేరుతో ప్రభుత్వ భూములను చెరబట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని అందుకు కేంద్రప్రభుత్వం పరంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సానుకూలంగా స్పందించిన ఈటెల రాజేందర్ త్వరలోనే ప్రభుత్వపరంగా చర్యలు తీసుకునేలా చూస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఎంపీ నిధులను కేటాయించడం ద్వారా సమస్యలను పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని ఏమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు.





వీణవంక మండలం మామిడాలపల్లి సర్పంచ్ గా ఎన్నికైన శ్రీరామోజు చంద్రమౌళి సన్మానించిన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్.

- నవతరం, హైదరాబాద్



కొండగట్టు ఆలయ అభివృద్ధికి టీటీడీ నిధులు... తెలంగాణలోని కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి నాకు పునర్జన్మ ఇచ్చారు. దర్శనానికి వెళ్తే పూజారులు భక్తుల సౌకర్యార్థం మండపం నిర్మించేందుకు సహకరించాలని కోరారు. నేను చేస్తానని హామీ ఇచ్చాను. 2 వేల మంది భక్తులు దీక్ష విరమణ చేపట్టేలా మండపం, 96 గదులతో సత్రం నిర్మించేందుకు రూ.35.19 కోట్లు ఇచ్చేందుకు టీటీడీ బోర్డు రెండు రోజుల క్రితం ఆమోదం తెలిపింది. - ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

- నవతరం, హైదరాబాద్



జోగులాంబ గద్వాల జిల్లా పర్యటనలో భాగంగా తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం పంప్ హౌస్ ను పరిశీలించారు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత. పంపు హౌస్ మూడు మోటార్లు అందుబాటులో ఉండగా కేవలం ఒకే మోటార్ రన్ చేయడానికి కారణాలు, తుమ్మిళ్ల నిర్మించినా ఆర్డీఎస్ ఆయకట్టు పెరగక పోవడానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు.

- (నవతరం, జోగులాంబ గద్వాల జిల్లా)

### నేటి ప్రజావాణి రద్దు



కరీంనగర్, నవతరం: కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో నేటి సోమవారం ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. రెండో సాధారణ పంచాయతీ ఎన్నికలు 2025 లో గెలుపొందిన సర్పంచ్, వార్డు సభ్యులు ఈ నెల 22వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నందున అధికార యంత్రాంగం ఆయా పనులలో నిమగ్నమై ఉంటారని పేర్కొన్నారు. ఈ కారణంగా ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని తెలిపారు. ఈ నెల 29వ తేదీ నుండి యధాతధంగా ప్రజావాణి నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ వెల్లడించారు. ప్రజలు, దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కలెక్టర్ కోరారు.

### ఆలయ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ జగన్



కుత్బుల్లాపూర్, నవతరం: జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలో మగ్దూం నగర్ లో శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు జగద్గిరిగుట్ట కార్పొరేటర్ జగన్. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమురవెల్లి మల్లన్న కళ్యాణ మహోత్సవం అనంతరం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మగ్దూం నగర్ లోని ఆలయంలో కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుక హాజరై ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి కృప కటాక్షాలతో జగద్గిరిగుట్ట డివిజన్ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోలుకుల జైహింద్, బండ మహేందర్, రాయి విగ్నేష్ వినోద్, నాని చారి, ఆలయ కమిటీ అధ్యక్షులు సుజిత్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ రాజు, కమిటీ సభ్యులు, రాములు, భాస్కర్, దినేష్, విటల్, కిషన్, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.




కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఏఐసీసీ నాయకురాలు సోనియాగాంధీ కు లేఖ రాయడంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణకు కేంద్రం ఇచ్చిన నిధులు, రెండేళ్లలో కాంగ్రెస్ చేసిన సంక్షేమ అభివృద్ధిపైన కిషన్ రెడ్డి చర్చకు రావాలి. తాము ఇచ్చిన ఆరు గ్యారంటీలలో రెండేళ్లలో మెజారిటీ గ్యారంటీలు నెరవేర్చాం, ఇంకా మూడేళ్లలో మిగతావి అమలు చేయడానికి సిద్ధమన్నారు.

- (నవతరం, హైదరాబాద్)

Owned and Published by Sirigiri Varadaraju, Printed at: Shesha Sai Enterprises, Plot No. 98/1, CIE, Phase 2, Gandhinagar, Hyderabad - 37, Telangana State, India, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: navataramtelugudaily@gmail.com, Telangana State Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com